నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, సోమవారం 28 ఏప్రిల్ 2025 | RANGAREDDY



పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద కేటీఆర్‌కు ఘనస్వాగతం పలుకుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

## ఊరూరి నుంచి కదలిన గులాబీ దండు

# గుండెనిండా అభిమానంతో.. గులాబీ పండుగకు..

- ఎల్కతుర్తికి వెళ్లే తొవ్వలన్నీ గులాబీమయం
- ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా వాహనాలు ఏర్పాటు చేయలేకపోయామన్న పార్టీ వర్గాలు
- స్వచ్ఛందంగా సభకు తరలిన ప్రజలు
- సభకు వెళ్లేముందు ప్రతి గ్రామంలోనూ జెండాల ఆవిష్కరణ
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రిసబితారెడ్డి

తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఉత్సాహంగా పెద్దఎత్తున తరలివెళ్లారు. గులాబీ పండుగను ఇంటి పండుగగా భావించి ప్రతి ఊరు నుంచి వాహనాల్లో వరంగల్ సభకు దండిగా కదలివెళ్లారు. దీంతో ఉమ్మడి జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. పార్టీ తరఫున వాహనాలు ఏర్పాటు చేసినా, ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ఏర్పాటు చేయలేకపోయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సభకు ప్రతి గ్రామం నుంచి ఉదయం 7 గంటలకే బస్సులు, ఇతర వాహనాలకు గులాబీ జెండా కట్టుకొని గుండె నిండా అభిమానంతో స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లారు. పార్టీ రజతోత్సవ సభ కోసం ఉమ్మడి జిల్లాలో మాజీ మంత్రి సబితారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి గులాబీదండును సన్నద్ధం చేశారు. సభకు వెళ్లేందుకు కేటాయించిన వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. బహిరంగ సభకు వెళ్లడానికి ముందు ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులో పార్టీ జెండాలను ఎగురవేసి సంబురాలు జరుపుకొన్నారు. పార్టీ రజతోత్సవ సభ తమ ఇంటి పండుగగా భావిస్తున్నామని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం స్వయంగా వినడానికి వెళ్తున్నామని పలువురు పేర్కొన్నారు. సుమారు 300 కిలోమీటర్ల దూరంలో సభ నిర్వహించినా వృద్ధులు సైతం ఉత్సాహంతో వెళ్లారు. అన్ని దారులు గులాబీమయంతో నిండిపోయాయి. భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. బహిరంగసభలో పాల్గొనటానికి విచ్చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పెద్ద అంబర్‌పేట్ వద్ద పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ నాయకుడు దండెం రాంరెడ్డి, యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ)/పరిగి




వికారాబాద్‌లో పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం బీఆర్ఎస్ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



బస్సులో బహిరంగసభకు బయలుదేరి వెళుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



పరిగిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బీఆర్ఎస్ నాయకులతో కలిసి వరంగల్ సభకు తరలివెళ్లిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



కడ్తాల్‌లో వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రజతోత్సవ సభకు కదిలిన వాహనాలతో రద్దీగా మారిన హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి




లింగారెడ్డిగూడ వద్ద వరంగల్ సభకు వెళ్తున్న వాహన శ్రేణికి జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాబాద్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



## బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుల చేరిక

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27 : ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నీలం ఆంజనేయులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు దోమకొండ నర్సింహులు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకనే బీఆర్ఎస్‌లో చేరుతున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, మహేశ్, చంటి, బాషా, నర్సింహ, రాములు, పాండురంగారెడ్డి ఉన్నారు.



మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఎలిమినేడు మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు




## కేసీఆర్ సారు ఉన్నప్పుడే సల్లంగ బతికినం..

ఈ ఫొటోలో ఉన్నది కేసీఆర్ సారు.. ఈ సారు సర్కారు ఉన్నప్పుడే మనకు ప్రతినెలా ఠంచన్‌గా పింఛన్ డబ్బులొచ్చేవి. పంటల సాగుకు ముందే విత్తనాలు, ఎరువులు కొనేందుకు మన ఖాతాల్లో రైతుబంధు డబ్బులు పడ్డాయి. నా మనుమరాలి వివాహానికి కల్యాణలక్ష్మి కింద పైసలిచ్చి ఆదుకున్నడు. ఏడున్నడో దేవుడసోంటి బంగారం లాంటి మనిషి.. సల్లగుండాలే.. ఎన్ని రోజులవుతుందో ఆయనను సూడక. ఈ సారు ఉండగా ఎలాంటి ఇబ్బంది లేకుండా బతికినం.. కానీ, కాంగ్రెసోళ్లు వచ్చాక పైసలే వస్తలేవు. ఎలాంటి ఇబ్బంది లేకుండా అందర్నీ బాగా చూసుకున్న దేవుడ్ని వదిలేసి దెయ్యాన్ని గెలిపించుకున్నం.. మల్లీ ఎప్పుడు ఓట్ల పండుగొచ్చినా మనం ఈ సారుకే ఓటేద్దామని ఆదివారం మంచాల మండలం ఆరుట్లలో గోడకు అంటించిన కేసీఆర్ ఫొటోను చూపుతూ ఓ అవ్వ.. మరో వృద్ధుడితో అంటున్న మాటలివి.. - ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27



## నమస్తే ఎఫెక్ట్

కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ఆదివారం తిరిగి ప్రారంభమయ్యాయి. 'నిధుల్లేక ఆగిన నిర్మాణం' అనే శీర్షికన ఈ నెల 21న ప్రచురితమైన కథనానికి స్పందించిన పాలకులు నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని తీసుకొచ్చి పనుల్లో వేగం పెంచారు. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఉన్న అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు ఎమ్మెల్యే సూచించడంతో నిర్మాణ పనులను దగ్గరుండి చేయిస్తున్నట్లు మాజీ సర్పంచ్ శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు రాఘవేందర్, రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- కేశంపేట, ఏప్రిల్ 27